క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



గోపాల్‌పేట: మండల కేంద్రంలోని బస్టాండు ఆవరణలో సోమవారం అయ్యప్ప మాలధారుల ప్రచార సేవాసమితి ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం అయ్యప్పస్వామి పుట్టినరోజు సందర్భంగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రంలో తాగునీటితో పాటు మజ్జిగ, రాగిజావ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కాశీపతి, భవన్, సాయిబాబ, వెంకట్, సురేష్, శ్రీనివాసచారి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



వీపనగండ్ల: మండల కేంద్రానికి చెందిన ఎరుకలి దొబ్బలయ్య పాములు పట్టే వృత్తిలో కొనసాగుతూ తాను ఇటీవలే పాముకాటుకు గురై మరణించాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం గ్రామంలోని పలువురు పెద్దలు పరామర్శించి రూ.22 వేల ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వీరి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని గ్రామ పెద్దలు ముంత మల్లయ్యయాదవ్, వెంకట్‌రెడ్డి, సాయిబాబ, కావలి మహేష్, రాజు, బాలపీరు, వెంకటయ్య తదితరులు కోరారు.

అనంతరాములుకు ఘన నివాళి



మదనాపురం: మండలంలోని అజ్జకొల్లులో సోమవారం అనంతరాములు మూడో వర్ధంతి సందర్భంగా ఆయన స్తూపం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి సీపీఎం నాయకులు నివాళులర్పించారు. మండల సీపీఐఎం కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ పార్టీలో కీలకంగా పని చేసి ఎందరికో చైతన్య స్ఫూర్తినిచ్చిన ఆయన ఎన్నో ఉద్యమాలు చేసి ప్రజలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఆయన సతీమణి శారద, కుమారుడు క్రాంతి, నాయకులు కొటకొండ చెన్నయ్య, బడికిని విష్ణు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

గోపాల్‌పేట: రేవల్లి మండలంలో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వంద మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరడం హర్షించదగిన విషయమని జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోమవారం ఆయన సమక్షంలో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో రేవల్లి మండలంలోని చెన్నారం, గొల్లపల్లి గ్రామాల్లోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాబోయే కాలంలో వీరు కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపేందుకు కృషి చేస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

మూర్ఛ వ్యాధితో పొలంలోనే రైతు మృతి

అమరచింత: వరి పంటకు నీటిని మళ్లించడానికి వెళ్లిన రైతు తిరుపతయ్య (49) మూర్ఛ రోగంతో పంట పొలంలోనే మృతి చెందిన ఘటన మండలంలోని సింగంపేటలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం తిరుపతయ్య తన పొలంలోని రెండు ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పంటకు నీటిని మళ్లించడానికి పొలానికి వెళ్లాడు. నీటిని పారబెడుతుండగా మూర్ఛ వచ్చి పడిపోయాడు. సమీప రైతులు గమనించి తిరుపతయ్యను ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు కుమార్తె ఉన్నారు.

ఇటుక బట్టీలో బాల కార్మికులు

కోడేరు: మండల కేంద్రమైన కోడేరుతో పాటు మైలారం, నర్సాయిపల్లి తదితర గ్రామాల్లో ఇటుక బట్టీల్లో బాల కార్మికులు పనిచేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి పొట్టకూటి కోసం వలస వచ్చిన కుటుంబాల పిల్లలతో యజమానులు పనులు చేయించుకుంటున్నారు. నిబంధనలు విరుద్ధంగా చిన్నారులతో పనులు చేయించుకుంటున్న ఇటుక బట్టీల యజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు స్పందించి తనిఖీ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



హోలీ.. రంగేలీ


తెల్లరాళ్లపల్లితండాలో..


కొత్తకోటలో యువతుల సందడి


కొత్తకోటలో..

హోలీ పండుగను సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రజలు సంతోషంగా నిర్వహించారు. ఆదివారం రాత్రిలో ప్రజలు గ్రామాల్లో కామదహనం చేశారు. ఈ సందర్భంగా కోలాటం, బొడ్డెమ్మలు ఆడారు. కామదహనం సందర్భంగా కందులు, ఉలువలు, రాగులు, జొన్నలు, పెబ్బర్లు తదితర ధాన్యాలను నుగ్గులపై ఉడికించి రైతులు పశువులపై చల్లుకున్నారు. సోమవారం ఉదయం నుంచి గ్రామాలు, తండాల్లో చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా ప్రజలంతా హోలీ సంబురాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు రంగులు చల్లుకుని కేరింతలు కొట్టారు. రాజకీయ నాయకులు ప్రజలు శుభాకాంక్షలు తెలుపుతూ.. అందరి జీవితాలు రంగులమయంగా మారి సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం యువత డీజే పాటలు ఏర్పాటు చేసి వాటికి అనుగుణంగా డ్యాన్స్‌లు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.

–సాక్షి, నెట్‌వర్క్


అప్పారెడ్డిపల్లిలో..


వీపనగండ్లలో..


ఖిల్లాఘనపురంలో హోలీ ఆడుతున్న చిన్నారులు


ఆత్మకూర్‌లో..


కేతేపల్లిలో..


హోలీ సంబరాల్లో చత్రపతి వాకింగ్ క్లబ్ సభ్యులు


కొత్తకోటలోని గణేష్ నగర్ కాలనీలో హోలీ సంబరాల్లో మహిళలు


వనపర్తిలో..


ఆత్మకూర్‌లో..


రాంపురంలో..


ఆత్మకూర్‌లో..


అమరచింతలో..


మదనాపురంలో..


నందిమళ్లలో ప్రజాపంథా మాస్‌లైన్ పార్టీ ఆద్వర్యంలో హోళీ వేడుకల్లో యువకులు


చందాపురంలో..


ఆత్మకూర్‌లో..


పాన్‌గల్‌లో..

గడ్డివాము దగ్ధం



వీపనగండ్ల: మండలంలోని నాగర్లబండతండా పంచాయతీకి చెందిన రాత్లావత్ ప్రకాష్ అనే రైతుకు చెందిన గడ్డివాము, వేరుశనగ పొట్టు సోమవారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. దీంతో రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. జీవనోపాధి కోసం 30 గొర్రెపిల్లలు, నాలుగు పశువులను తెచ్చుకొని పెంచుకుంటున్న సమయంలో గడ్డివాము పూర్తిగా కాలిపోవడం వల్ల మూగజీవాలకు మేత లేకుండా పోయిందని, ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని రైతు కోరారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



కోడేరు: మండలంలోని మాచుపల్లి, మైలారం తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ప్రధాన రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. కంచెలేకపోవడంతో మూగజీవాలు విద్యుత్‌ఘాతంతో మృతిచెందిన ఘటనలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

మానవపాడు: మండలంలోని చంద్రశేఖర్‌నగర్‌లో సోమవారం ఓపెన్ టోర్నమెంట్ విజేతలకు నిర్వాహకులు నాగశేషు, నాగరాజు, మహేష్‌లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడలు మానసిక, శరీరక దృఢత్వాన్ని అందిస్తాయని తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో 25 జట్లు పాల్గొనగా, మొదటి, రెండు బహుమతులు తాండ్రపాడు రూ.15వేలు, రూ.8వేలు, మూడో బహుమతి అనంతపురం జిల్లా జట్లు రూ. 5వేలు గెలుపొందినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తం

జోగుళాంబ శక్తిపీఠం: రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ఎస్‌ఐ నాగరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం దగ్గర పబ్లిక్‌తో మాట్లాడారు. రోడ్డు భద్రత విషయంలో ప్రజలకు పలు సూచనలు చేశారు. ఇటీవల ఇమాంపూర్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదాలను కూడా ప్రజలకు గుర్తు చేశారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. అపరిచితులకు సెల్‌ఫోన్ పాస్‌వర్డు ఓటీపీలు, బ్యాంకు అకౌంట్ నెంబర్లు ఇవ్వడం వంటివి చేయరాదన్నారు. కొత్త వ్యక్తుల అనుమానాస్పద కదలికలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని, ఏదేనీ అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

లాడ్జీల నిర్వాహకులకు ఆదేశాలు జారీ

లాడ్జీలలో ఎవరైనా బస చేసేందుకు వస్తే వారి దగ్గర ఆధార్‌కార్డు, అడ్రస్ ప్రూఫ్ తీసుకోవాలని, వాటిని నిర్ధారించుకున్న తరువాతే అనుమతులు ఇవ్వాలని సూచించారు. వారు ఏ పని నిమిత్తం ఇక్కడికి వచ్చారు, ఎన్ని రోజులు ఉంటారు, తదితర విషయాలను తెలుసుకోవాలని సూచించారు.

చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు


కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


అమ్మవారి అలంకరణ వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

వనపర్తి టౌన్: చౌడేశ్వరి దేవి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టడంతో ఆలయంలో దేవి నామస్మరణతో మార్మోగింది. తెల్లవారుజామున అమ్మవారికి, మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం, పవిత్ర జలంతో అభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అభిషేక కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి అలంకరణ అనంతరం దివ్య రూప దర్శనానికి భక్తులకు అనుమతిచ్చారు. ఈ మేరకు ఆలయంలో మహిళలు సామూహికంగా రెండు గంటల పాటు భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన చేపట్టారు. కుంకుమార్చన చేసిన కుంకుమను అమ్మవారికి సమర్పించి ప్రసాదంగా భక్తులు స్వీకరించారు. చౌడేశ్వరి దేవితో పాటుగా ఆలయంలో ఇరువైపులా కొలువున్న మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామిలకు సైతం పూజాధికాలు నిర్వర్తించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కొన్ని నెలలుగా ప్రతి శుక్రవారం అమ్మవారికి అలంకరణ కోసం వినియోగించిన చీరలు, జాకెట్ పీసులను విక్రయించేందుకు ఆలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయడంతో మహిళా భక్తులు అమ్మవారి ప్రసాదంగా భావించి వాటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. అమ్మవారి అలంకరణకు వినియోగించిన వస్త్రాలను విక్రయించి ఆలయ అభివృద్ధికి వినియోగిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు రంగం ఆంజనేయులు, గౌరవాధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు.

జింకపై కుక్కల దాడి


జింకను ఫారెస్ట్ అధికారులకు అప్పగిస్తున్న రైతు

ఖిల్లాఘనపురం: వ్యవసాయ పొలంలో మేత కోసం వచ్చిన జింకపై కుక్కలు దాడి చేయడంతో ఓ రైతు కాపాడి ఫారెస్టు అధికారులకు అప్పగించారు. ఖిల్లాఘనపురం మండలంలోని మానాజీపేటకు చెందిన కుమ్మరి ఆంజనేయులు వ్యవసాయ పొలంలో సోమవారం తెల్లవారుజామున ఓ జింక వరి పంటలో మేత మేస్తూ కనిపించింది. అక్కడే ఉన్న కుక్కలు గమనించి జింకను వెంబడించాయి. చివరకు దాడి చేసి కరుస్తుండటంతో అక్కడే ఉన్న కుమ్మరి నరేష్ కుక్కల బారి నుంచి జింకను రక్షించాడు. మాజీ సర్పంచ్ సతీష్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఫారెస్టు అధికారులకు విషయం చేరవేశారు. జింకకు గాయాలు కావడంతో పశువైద్యాధికారులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకున్న ఆయా శాఖల అధికారులు మొదటగా గాయాలకు చికిత్స చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన ఫారెస్టు అధికారులు వంశీ, అంజనేయులు, చంద్రలకు జింకను అప్పగించారు. జింకను తీసుకెళ్లి అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు వారు చెప్పారు.

రేపు సింగిల్‌విండో మహాజన సభ

పాన్‌గల్: స్థానిక సింగిల్ విండో మహాజన సభ విండో చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్లు విండో సీఈఓ భాస్కర్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో 29 మార్చి 2023 నుంచి 28 మార్చి 2024 వరకు జమ ఖర్చులు ఆమోదించుట, 2024–2025 సంవత్సరానికి అంచనా బడ్జెట్, ప్రణాళిక, ఇతర అంశాలు ఆమోదించుట గురించి సమావేశంలో చర్చిస్తారన్నారు. సమావేశానికి సంఘం సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని సీఈఓ కోరారు.

పేకాటరాయళ్ల అరెస్టు

పెబ్బేరు రూరల్: పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు పట్టుకున్న ఘటన సోమవారం వనపర్తి మండలంలోని అంజనగిరి శివారులో చోటుచేసుకుంది. వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని అంజనగిరి శివారులోని బొలంకి గుట్టపై కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం రావడంతో స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతన్న ఇద్దరు వ్యక్తులతో పాటు రూ.16 వేల నగదు, 2 సెల్‌ఫోన్లు, 2 బైకులను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంజనగిరిలోని ఓ ఇంట్లో చోరీ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని అంజనగిరిలో తాళం వేసిన ఇంటిలో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని అంజనగిరిలోని కావలిగేరిలో నివాసం ఉంటున్న కావలి శిరీష ఇంటికి తాళం వేసి పనిమీద బయటికి వెళ్లింది. ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగలగొట్టి, ఇంట్లోని బీరువాలో ఉన్న అర్ధ తులం బంగారు కమ్మలు, గుండ్లు, రెండు మాసాల ముక్కుపుడక, 15 తులాల వెండి గొలుసులు, రూ.20 వేల నగదు చోరీ చేశారని బాధితురాలు కావలి శిరీష ఫిర్యాదులో పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

వాహనాల తనిఖీలు



ఆత్మకూర్: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపడుతున్నామని సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. సోమవారం రాత్రి ఆర్టీసీ బస్సుల్లో, వాహనాల్లో తనిఖీలు నిర్వహించి ప్రయాణికులకు పలు సూచనలు చేసారు. నగదు తరలింపు చేపట్టే వారు సరైన ఆధారాలు చూపెట్టకుంటే సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ బీచుపల్లి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఇఫ్తార్ విందు



ఆత్మకూర్: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు సోమవారం రాత్రి స్థానిక మసీదే నూర్‌లో, మసీదే సయ్యదీయాలో మహ్మద్ షరీఫ్, మహిమూద్, అల్తాఫ్ ఆధ్వర్యంలో దివంగత ముఖీద్ కుమారులు అబ్దుల్‌మునీర్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులను వేర్వేరుగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలానా అబ్దుల్‌అలీంరషాది, హాఫీజ్ అజ్హర్‌అలీ ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.